

# జాయ సేనాపతి

55
ధారావాహిక

మత్తి భానుమూర్తి
99893 71284

చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** రాజనగరిలో చక్రవర్తి బంధువులు, జ్ఞాతులు.. ఎందరో ఉన్నారు. వారంతా నారాంబను, జాయపుణ్ని కలవడానికి ఉత్సుకత చూపుతున్నారు. ఇటు నారాంబ కూడా తనకు దక్కిన మహారాణి హోదాను అపురూపంగా భావిస్తూ.. అందరినీ కలుపుకొని పోతున్నది. అయితే ఇప్పుడు రాజప్రాసాద కుటుంబాల దృష్టి నారాంబను దాటి జాయపుని పైన ఉన్నది. చక్రవర్తి సూచనతో జాయపుడు కూడా రాజ్యంలోని ప్రముఖుల ఇళ్లను సందర్శిస్తున్నాడు. వారి ఆతిథ్యాన్ని స్వీకరిస్తున్నాడు.

ఓ రోజు హఠాత్తుగా..

''నిన్న నా మందిరానికి విధకదేవుడు వారి ధర్మపత్ని విచ్చేశారు. వారు బావగారి పినతండ్రి కుమారులు. అసలు రుద్రదేవులవారు ఈయన్నే దత్తత తీసుకోవాల్సి ఉన్నదట. దత్తత తీసుకుంటే ఈరోజున ఆమె పట్టమహిషి అయి ఉండేదట. 'ఏమిటో నాకు పెట్టి పుట్ట లేదు. ఇంతే నా ప్రాప్తం!' అని వాపోయింది. కబుర్లు ముచ్చట్లు అయ్యాక.. 'మీ తమ్ముడు జాయప సేనానులకు వివాహ ప్రయత్నాల సంగతి ఏవిటి నారాంబా!?'.. అన్నదామె. నేను ఆశ్చర్యంతో నోరు తెరిచి ఉండిపోయాను. నామతి మండా!.. ఆమె అనే వరకూ నాకూ ఆ ఆలోచనే రాలేదు తమ్ముడూ..'' అన్నది నారాంబ.

ఓ గొప్ప సంగతి తను మర్చిపోతే.. మరెవరో గుర్తు చేయడం ఆమెకు దిగులు కలిగించింది.

తమ్మునికి వివాహం చెయ్యాలనే ఆలోచన రాక పోవడం పట్ల నారాంబ ఖిన్నురాలయ్యింది.

'ప్చ్.. వాడి వివాహం సంగతి నాకెందుకు తోచ లేదు..?'.. రోజూ అదే దిగులు. అదే ఆలోచన. రోజంతా ఏకవాక్య సమస్య. దానిని గణపతిదేవుడు పూరించాడు.

''సరే సరే! రోజూ మా చెవి దగ్గర అదే నస ఏమిటి? మీ నాన్నగారికి కబురు పెడతాను. వారు వచ్చాక మీరూ మీరూ కూర్చుని చర్చించి, జాయప వివాహం నిశ్చయించండి..'' అన్నాడు.

మరో పక్షం రోజుల్లో పినచోడుడు అనుమకొండకు విచ్చేశాడు.

''ఉన్నపళంగా రమ్మని వార్త పంపారు.. ఏమిటి విషయం? నారాంబ వల్ల మీకేమైనా కష్టం..'' ఆయన వాక్యం పూర్తి కాకుండానే.. గణపతిదేవుడు నవ్వుతూ..

''రోజూ మా చెవులు రెండూ నమిలేస్తున్నది మీ ముద్దుల కూతురు. సంగతేమిటో ఆమెనే అడగండి. ఈలోగా మేమొక సమావేశం నిర్వహించి వస్తాం. కలసి భోజనం చేద్దాం..'' అని వెళ్లిపోయాడు.

అసలు సంగతి చెప్పి పినచోడుని ఆందోళనను ఆనంద సందోహంగా మార్చింది నారాంబ.

ఆయన కూడా జాయపుని వివాహం ఇప్పటికే ఆలస్యం అయ్యిందని.. వెంటనే చెయ్యాలన్న తలంపుతోనే ఉన్నాడు. చక్రవర్తి పంపిన వార్తను బట్టి చూస్తే.. ఆయన కూడా జాయపుని వివాహం పట్ల ఆసక్తిగానే